సాక్షి
కుమురం భీం

బుధవారం, 1, జనవరి, 2025



రిటైర్డ్ కార్మికులకు సన్మానం
బెల్లంపల్లి ఏరియాలో వివిధ గనుల్లో విధులు నిర్వహించి పలువురు ఉద్యోగులు, కార్మికులు రిటైర్డ్ అయ్యారు. వీరిని అధికారులు శాలువాలతో సన్మానించారు. 9లో▸



గ్రంథాలయ పనుల పరిశీలన
జైనూర్: మార్లవాయి గ్రామంలో చేపట్టిన డిజిటల్ లైబ్రరీ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మంగళవారం పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /13.0

వాతావరణం
కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. చలి కాస్త పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆరోసారి అదే పదవి..



శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఆరోసారి వైద్య శాంతికుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నల్గొండలో జరిగిన యూనియన్ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా శాంతికుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందుంటుందని, జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

హైమన్‌డార్ఫ్ వర్ధంతిని విజయవంతం చేయాలి



వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జైనూర్: ఆదివాసీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు వచ్చి వారితో మమేకమైన హైమన్‌డార్ఫ్ పుణ్య దంపతుల వర్ధంతిని జయప్రదం చేయాలని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గ్రామ పెద్దలతో కలిసి వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీల ఆపద్బాంధవుడు హైమన్‌డార్ఫ్ వారికోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదిక అందించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మండలంలోని మార్లవాయిలో ఈనెల 11న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డార్ఫ్ యువజన సంఘం నాయకులు మధురాజ్, ధర్మేందర్ తదితరులున్నారు.

ఇదెక్కడి న్యాయం సారూ..?



ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

బెజ్జూర్: 'ఇదెక్కడి న్యాయం సారూ..' అంటూ మండలంలోని ఎటిగూడ గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు తుమ్మ మహేశ్, మడే ప్రభాకర్ సోమవారం రాత్రి తమ పంట పొలానికి కాపలాగా వెళ్లగా వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు పెట్టారంటూ పోలీసులు జీపులో తీసుకువచ్చి చిత్రహింసలు పెడుతున్నారని ఆరోపిస్తూ వారి కుటుంబీకులు ఆందోళన చేశారు. ఇంట్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా తీసుకువచ్చి ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలే గాని, ఇలా చేయడం సరికాదని పేర్కొన్నారు. తమ కుమారులను చూపించాలంటూ రేంజ్ కార్యాలయానికి వెళ్లారు. దీంతో అక్కడ లేరని అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ విషయమై అటవీ రేంజ్ అధికారి ముసవిర్‌ను సంప్రదించగా.. వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారని, వారితో పాటు వన్యప్రాణులను హతమార్చేందుకు ఏర్పాటు చేసిన తీగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ నిమిత్తం ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తున్నామని, వారిని ఎవరూ ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని వివరించారు.

91శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): డిసెంబర్‌లో బెల్లంపల్లి ఏరియా 91శాతం బొగ్గు ఉత్పత్తిని నమోదు చేసుకుందని ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఆయన ఏరియా సాధించిన ఉత్పత్తి వివరాలు విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ ఏరియా ఉత్పత్తి లక్ష్యం 4.20 లక్షల టన్నులు కాగా, 3.84 లక్షల టన్నులతో 91శాతం ఉత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఏరియా 91శాతం వార్షిక ఉత్పత్తి సాధనతో ముందుకు సాగుతోందని తెలిపారు. మిగతా మూడునెలల కాలాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని 100 శాతం వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో గోలేటి ఓసీపీని ప్రారంభించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. గోలేటితో పాటు ఎంవీకే ఓసీపీ ఏర్పాటుకు అవసరమైన అటవీశాఖ భూముల అనుమతులకు ప్రయత్నిస్తున్నామన్నారు. డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ ఉన్నారు.

దేశసేవ చేయాలని ఉంది



నేను డిగ్రీలో చేరిన తరువాత సమాజంలో ఎలా ఉండాలో తెలుసుకున్నాను. ఎన్‌సీసీ లీడర్‌గా పని చేస్తున్న. ఇటీవల ఎన్‌సీసీ ఫైరింగ్ నేషనల్ లెవెల్ కాంపిటీషన్‌లో పాల్గొన్న. ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశ సేవ చేయాలనేది నా లక్ష్యం. 2025లో తప్పకుండా లక్ష్యాన్ని సాధిస్తాను.

– వాణిశ్రీ, ఫైనలియర్

రక్షణ చర్యలు చేపట్టాలి



మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. దాడులు జరిగినపుడు మహిళలు ప్రతిఘటించాలి. అందుకే నేను ఎన్‌సీసీలో చేరాను. ఆత్మరక్షణ కోసం కరాటే, యోగా నేర్చుకుంటున్న. 2025లో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్, డిగ్రీ బాలికలకు కరాటే నేర్పించేలా మంచి నిర్ణయం తీసుకోవాలి.

– పద్మావతి, ఫైనలియర్

సంతోషంగా ముగిసింది



మా కళాశాలలో చదువుతోపాటు సమాజంలో మహిళలు ఎలా ఉండాలో తెలుపుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తున్నారు. 2024 సంతోషంగా ముగిసింది. 2025 కూడా ఇలాగే ఆనందంగా సాగాలని దేవుడిని కోరుకుంటున్న. 2025లో పోలీస్ ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– అమ్మిరిన్‌బాను, బీకాం సీఏ

2024 సంవత్సరం త్వరగా ముగిసింది



మా కళాశాలలో అధ్యాపకులు విద్యార్థినులందరికీ క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారు. వారానికోసారి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కోసారి 2024 సంవత్సరం ఇంత త్వరగా గడిచిందా.. అనిపిస్తోంది. 2025లో బ్యాంక్ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– సాయిప్రియ, ఫైనలియర్



కోటి ఆశలతో..

- 2025 అంతా బాగుండాలని..
- అందరి ఆకాంక్ష నెరవేరాలని..
- అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని..
- కోరుతున్న విద్యార్థిని లోకం
- డిగ్రీ కళాశాలలో 'సాక్షి' డిబేట్

ఆసిఫాబాద్‌రూరల్: 2024 కాలగర్భంలో కలిసిపోయింది. 2025 రానే వచ్చింది. గతేడాది ఎన్నో ఒత్తిడులు, ఓటమిలను జయించిన వారంతా నూతన సంవత్సరంలోకి కోటి ఆశలు, కొంగొత్త ఆశయాలు, సరికొత్త లక్ష్యాలతో అడుగిడుతున్నారు. నయా సాల్‌లో ఏదో సాధించాలన్న ఆరాటం ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలోని మహిళా గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థినులు 2024లో వారి అనుభవాలు తెలిపారు. 2025 వారి ఆశలు.. లక్ష్యాలను వెల్లడించారు. మంగళవారం కళాశాలలో 'సాక్షి' నిర్వహించిన డిబేట్‌లో వారి మనోగతం వెల్లడించారు. కొత్త ఏడాదిలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని.. ఆనందంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు

2025లో అంతా మంచే జరగాలని..



ఆసిఫాబాద్‌లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడిన నుంచి నేను నా ఇద్దరు స్నేహితులతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న. స్నేహానికన్న మిన్నా.. లోకాన లేదు.. అన్న ఓ సినీ కవి మాట అక్షర సత్యం. మా ముగ్గురి ప్రాణం ఒక్కటే అనేలా మా స్నేహ బంధం ఆది నుంచీ కొనసాగుతోంది. అతి మధురమైనది స్నేహం. మా స్నేహం ఇంతకుముందు లాగా 2025 సంవత్సరంలోనూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్న.

– హారిక, పీడీ

మంచిరోజులు వస్తాయని..



చదువుతో పాటు నాకు క్రీడలు అంటే చాలా ఇష్టం. యోగా, రన్నింగ్, బాక్సింగ్‌లో నేను గోల్డ్ మెడల్ సాధించాను. నాకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే బాక్సింగ్‌లోనూ మరింత రాణిస్తాననే నమ్మకముంది. 2025లో మంచి జరగాలని, నాకు మంచి రోజులు రావాలని ఆశిస్తున్న.

– కుద్మెత శ్రీదేవి, ఫైనలియర్

ఆర్మీ పోలీస్‌ను అవుతా



నేను ఎన్‌సీసీలో చేరాను. ఎన్‌సీసీలో సమాజం పట్ల ఎలా ఎండాలి.. క్రమ శిక్షణతో ఎలా మెలగాలో నేర్పుతున్నారు. ఆర్మీ పోలీస్ ఉద్యోగం అంటే నాకు చాలా ఇష్టం. ఎంత కష్టమైనా ఈ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకుపోతాను. తప్పనిసరిగా ఆర్మీ పోలీస్‌ను అవుతాను.

– వైష్ణవి, సెకండియర్

అమ్మమ్మకు అండగా ఉంటా



నా చిన్నతనంలోనే మా అమ్మ చనిపోయింది. అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఇంటర్ చదివాను. 2022లో ఈ కళాశాలలో చేరాను. అందరితో కలిసిమెలిసి చదువుకుంటున్న. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి మా అమ్మ ఆశయాలను నిజం చేసి తాతయ్య, అమ్మమ్మకు తోడుగా ఉంటా.

– పల్లవి, ఫైనలియర్

ఆకాంక్షలు నెరవేరాలని..



విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోధిస్తున్నాం. వారు మంచి ప్రయోజకులుగా తయారు కావాలని ఆశిస్తున్నాం. 2025లో విద్యార్థినుల కొత్త ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నాం.

– శారద ప్రిన్సిపాల్

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు, యువకులు

- జిల్లా వ్యాప్తంగా సంబురాలు
- కిటకిటలాడిన కేక్ దుకాణాలు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలు మంగళవారం అర్ధరాత్రి నుంచే 2024కు వీడ్కోలు పలుకుతూ.. 2025కు ఘనస్వాగతం పలికారు. జిల్లా కేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకొన్నారు. కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులు, బంధువులకు సందేశాలు పంపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ షాపులు, స్వీట్ హౌస్‌లు కిటకిటలాడాయి. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కేక్‌లు విక్రయించారు. కిలో కేక్‌ను రూ.200 నుంచి రూ.400 వరకు విక్రయించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణించడంతో సంతాపదినాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వేడుకలు నిర్వహించరాదని సూచించగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వేడుకలు నిర్వహించలేదు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులే వేడుకలు జరుపుకొన్నారు.

సీసీఐలో ఇష్టారాజ్యం

- ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆగ్రహం
- విచారణ చేపట్టాలని ఆదేశం



కౌటాలలోని సీసీఐ కొనుగోలు కేంద్రం

కౌటాల: మండల కేంద్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఒక రైతుకు ధర చెల్లించడంలో ఇబ్బంది పెట్టడంతో అతడు సీసీఐ సిబ్బందిని నిలదీశాడు. ఒకే పత్తికి రెండు రకాల ధర చెల్లించడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. మొదట తేమను తక్కువగా నమోదు చేసిన సిబ్బంది అనంతరం ఎక్కువ నమోదు చేసి రైతుకు తెలియకుండా తక్కువ ధర నమోదు చేశారు. అక్కడే ఉన్న సీసీఐ అధికారి వర్ధన్‌ను ధరల విషయంపై రైతు సంప్రదించగా దురుసుగా ప్రవర్తించాడు. ఇష్టమున్న చోట చెప్పుకోవాలన్నాడు. దీంతో రైతు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీఐ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఫోన్‌లో సీసీఐ జిల్లా అధికారితో మాట్లాడారు. కౌటాల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదని పేర్కొన్నారు. అనంతరం రైతులు తహసీల్దార్ పుష్పలతకు ఫిర్యాదు చేయగా, బుధవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తామని ఆమె చెప్పారు. అనంతరం రైతుతో మాట్లాడిన సీసీఐ సిబ్బంది నష్టపోయిన ధర తిరిగి చెల్లిస్తామని సముదాయించారు.

అమ్మా.. కరుణించు..



జంగుబాయి గుహ



పోచమ్మ ఆలయంలోని ప్రతిమలు



పవిత్ర స్నానాలు ఆచరించే కొలను

- వనక్షేత్రంలో జంగుబాయి దేవత
- నేటి నుంచి నెలపాటు జాతర
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలం ముకదంగూడ గ్రామపంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 28వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. నెలపాటు ఆదివాసీల ఆరాధ్యదైవం.. అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేస్తుండటంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు సౌకర్యం కల్పించారు. మహరాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్, పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లు అమర్చారు. ఆలయం వరకు సీసీ రోడ్డు వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ సంవత్సరం జంగుబాయి ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తాగునీటితో పాటు రోడ్డు, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించింది. ఇటీవల జంగుబాయి ఉత్సవాలపై హట్టిలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎనిమిది గోత్రాలు ఒకే వేదికపై..

వివిధ రాష్ట్రాల్లో ఉన్న జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోదాలు పుజారులుగా వ్యవహరిస్తారు. వనక్షేత్రంలో బస చేసిన పోచమ్మతల్లికీ మొక్కు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారు చేస్తారు. సంప్రదాయ వాయిద్యాలతో గుహలోపలికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడున్న మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతల వద్ద మేకలు, కోళ్ల బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. రాత్రి భోజనాల అనంతరం సంప్రదాయ నృత్యాలు చేస్తారు.

ప్రభుత్వ గుర్తింపుతో అభివృద్ధి

ఏడేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం జంగుబాయి ఉత్సవాలకు గుర్తింపునిచ్చింది. ఏటా అభివృద్ధి కోసం రూ.10 లక్షలు విడుదల చేస్తోంది. ఈ నిధులతోనే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తారు. పూజాసామగ్రికి వెచ్చిస్తారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేకమంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్లు, రప్పలు, దుమ్ము, ధూళిలోనూ కొందరు కాలినడకన వస్తే.. మరికొందరు ఎడ్ల బండిపై వస్తారు. సుమారు వెయ్యికిపైగా ఎడ్లబండ్లు రావచ్చని నిర్వాహకుల అంచనా వేస్తున్నారు. పార్కింగ్ కోసం అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఇలా వెళ్లాలి..

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలంలోని ఆనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరందోళి మీదుగా, లేదా పరందోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుపై వెళ్లవచ్చు. నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా, ఆదిలాబాద్ నుంచి లోకారి మీదుగా కూడా జంగుబాయి ఆలయం వరకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

గుహలోనే దేవత..

జంగుబాయి దేవత గుహలో బస చేసి ఉంది. గుహ కావడంతో అక్కడికి భక్తులు కూర్చునే వెళ్తారు. చీకట్లో వెలుగుతున్న దీపం రూపంలో అమ్మవారు దర్శనమిస్తారు. కోరికలు తీర్చే తల్లిగా ఆదివాసీలు విశ్వసిస్తారు. పుష్యమాసం నుంచి అమావాస్య వరకు జాతర కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు నియమనిష్టలతో పాదరక్షలు లేకుండానే నడుస్తూ వస్తారు. నెల పాటు కటిక నేలపైనే పడుకుంటారు. దీపారాధనతో ప్రారంభమయ్యే ఈ జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



అమ్మవారి గుహలోని దీపం

సౌకర్యాలు కల్పించాం

జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం. ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ సిబ్బందిని నియమించాం. నెలపాటు వారు ఇక్కడే ఉండి ఆలయ ఆవరణను శుభ్రంగా ఉంచుతారు.

– అమ్జద్‌పాషా, ఎంపీడీవో

28వరకు జాతర



బుధవారం నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ–మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీ రోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్ లైట్లు కూడా అమర్చారు.

– మరప బాజీరావు, అలయ కమిటీ గౌరవాధ్యక్షుడు

అతివేగానికి ఇద్దరు బలి

- ఇప్పలగూడ సమీపంలో అదుపుతప్పిన బైక్
- ప్రమాదంలో ఇద్దరు మృతి
- ఒకరి పరిస్థితి విషమం

బెజ్జూర్: అతివేగం, నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. ముగ్గురు స్నేహితులు బైక్‌పై వస్తుండగా మండలంలోని ఇప్పలగూడ గ్రామ సమీపంలో అదుపుతప్పింది. ఈ ఘటనలో ఒకరు, మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. చింతలమానెపల్లి మండలం దింద గ్రామానికి చెందిన మెస్రం సాయి, ఇప్పలగూడకు చెందిన నైతం అజయ్, మొగవెల్లికి చెందిన ఆత్రం షణ్ముఖ ముగ్గురు స్నేహితులు. వీరందరూ కలిసి మంగళవారం రాత్రి అతివేగంతో బైక్‌పై మండలంలోని ఇప్పలగుడకు వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మెస్రం సాయి, నైతం అజయ్ మృతిచెందారు. సాయి సంఘటన స్థలంలోనే మృతిచెందగా, అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. తీవ్రగాయాలైన ఆత్రం షణ్ముఖ పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



నైతం అజయ్ (ఫైల్)



మెస్రం సాయి (ఫైల్)

ఇటుకబట్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ఇటుక బట్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఇటుక బట్టీ కార్మిక సంఘం(ఐఆర్‌టీయూ) నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఇటుక బట్టీల యజమానులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటుక బట్టీ కార్మికులు, యజమానుల మధ్య కూలీ రేట్ల పెంపుపై ఒప్పందం కుదిరిందని తెలిపారు. వెయ్యి ఇటుకల తయారీకి కూలి రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఒప్పందం రెండేళ్లు అమలుల్లో ఉంటుందని పేర్కొన్నారు. కూలీలకు యజమానులు కనీస వసతులు కల్పించాలని, పిల్లలు డ్రాపౌట్లు కాకుండా సమీపంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, పనిస్థలాల్లో ప్రమాదాల వైద్య ఖర్చులు యజమానులు భరించాలని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు జయరావు, నైనాల వెంకటేశ్వర్లు, కర్రె లచ్చన్న, సంకే రవి, తలండి లచ్చన్న, కుర్మ సమ్మయ్య, కోయిల మారయ్య, మంచాల భీమయ్య, ఇటుక బట్టీల యజమానులు ఐలయ్య, తిరుపతి, సతీష్, సిరిపురం రాజేష్ పాల్గొన్నారు.

చోరీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: ఆలయంలో చోరీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల రామాలయంలో గత జూన్ 9న చోరీ జరిగింది. పూజారి రాంశర్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు తిలక్‌నగర్‌కు చెందిన సయ్యద్ అఖార్ అలీని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు నేరస్తుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధించడంతోపాటు అప్పుగా తీసుకున్న రూ.20 లక్షలు మొత్తం చెల్లించాలని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష మంగళవా రం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ ఎల్.శ్రీనివాస్ కథనం ప్రకారం ..హాజీపూర్‌కు చెందిన మాధవరపు రాజేశ్వర్‌రావు వద్ద ఆదిలా బాద్‌కు చెందిన వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్‌నర్ సురభి కిషన్‌రావు రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పలుమార్లు అడిగిన ఇవ్వక పోవడంతో ష్యూరిటీగా రూ.10 లక్షల విలువ గల రెండు చెక్కులు ఇచ్చాడు. కిషన్‌రావు బ్యాంకు ఖాతా లో డబ్బులు లేనందన చెక్కులు బౌన్స్ అయ్యాయి. 2017లో రాజేశ్వర్‌రావు కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశాడు. విచారణ అనంతరం కిషన్‌రావుకు ఏడాది జైలు శిక్ష విధించడంతోపాటు రూ.20 లక్షలు రాజేశ్వర్‌రావుకు చెల్లించాలని మెజిస్ట్రేట్ తీర్పువెలువరించారు.